వాయిస్ టుడే
హైదరాబాద్
బుధవారం, 21 ఫిబ్రవరి, 2024



### రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అనిల్ కుమార్ యాదవ్‌కు

## ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శుభాకాంక్షలు

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– రాజ్యసభ సభ్యుడిగా అనిల్ కుమార్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యశుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం రోజు అసెంబ్లీ లో జరిగిన ఎన్నికల్లో రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి సర్టిఫికెట్ అందజేశారు.రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ సర్టిఫికెట్ అందుకున్న సమయంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో ఉన్నారు. అనంతరం మీడియా సమావేశంలో పాల్గొని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అసెంబ్లీ ఎన్నికల్లో గొల్ల కురుమలు 99శాతం ఓటు వేసి గెలిపించారన్నారు. రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా గొల్ల కురుమలు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి,జాతీయ అధ్యక్షుడు ఖర్గే కి,భావి ప్రధాని రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు గొల్ల కురుమలు తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గొల్ల కురుమలు కాంగ్రెస్ పార్టీ కి రుణపడి ఉంటారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తోనే గొల్ల కురుమలు అభివృద్ధి జరుగుతుందని గొల్ల కురుమలకు పెద్ద పీట వేసినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## కార్మిక కర్షక రాజ్యాధికారమే వర్కర్స్ పార్టీ లక్ష్యం

ఎల్ బి నగర్ ఫిబ్రవరి 20(వాయిస్ టుడే) కార్మిక కర్షకుల రాజ్యాధికారం కోసం వర్కర్స్ పార్టీ పనిచేస్తుందని వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి అన్నారు. మంగళవారం వర్కర్స్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆపార్టీ ప్రథమ వార్షికోత్సవ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేసి మాట్లాడారు. మార్చి 3న హైదరాబాదులో జరిగే వర్కస్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రథమ వార్షికోత్సవ సభకు కార్మికులు, రైతులు ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కొప్పు యాదయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ చుక్కల కళావతి, స్వాతి, నాగలక్ష్మి, గోపిక, రాజేశ్వరి, నర్సమ్మ, యాదమ్మ, నాగమణి, సంధ్య, శివ, రమణమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఇసుక మాఫియా వాగ్దానాలు హద్దులే లేవు



వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా (ఫిబ్రవరి 20) జడ్చర్ల నియోజకవర్గం మిడ్జిల్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలోని దుందుభి వాగు పరివాహక ప్రాంతంలో ఇసుక అనుమతులను రద్దు చేయాలని మంగళవారం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఇసుక టిప్పర్ లను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు నరసింహారెడ్డి, మల్లేష్, హరికృష్ణ, శ్రీకాంత్ తోపాటు పలువురు రైతులు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వఅవసరాల కోసం అయ్యవారిపల్లి లో ఇచ్చిన ఇసుక అనుమతులు రద్దు చేయాలని ధర్నాలు చేసిన ప్రస్తుత జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఇసుకను అడ్డుకుంటామని వాగ్దానాలు చేసిన ఎమ్మెల్యే ఇప్పుడు పట్టించుకోవడంలేదని వారు ఆరోపిస్తున్నారు. మిడ్జిల్ మండలంలో ఇసుక, మట్టి మాపియాను ఉక్కుపాదంతో అనచివేస్తామని గ్రామస్తుల సాక్షిగా అయ్యవారిపల్లి గ్రామ బొడ్రాయి పైన ప్రమాణం చేసి ఎన్నికలో ఓటు వేయించుకొని ప్రభుత్వం వచ్చిన తర్వాత మాట మారుస్తున్నారని వారు అన్నారు గత వారం రోజులుగా ఇసుక రవాణా చేయొద్దని రైతులు వేడుకుంటున్నా లెక్క చేయకుండా మళ్ళీ టిప్పర్లను పంపించి రైతులను బెదిరిస్తునరాని అడ్డుకుంటే కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అనుచరులు బెదిరింపులకు దిగుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇసుక అనుమతులను రద్దు చేయకుంటే నిరసనగా బుధవారం నుండి అయ్యవారిపల్లి గ్రామంలో ఆందోళన కార్యక్రమాలు చేయడం జరుగుతుందని వారు అన్నారు కావున మండలంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు దుందుబి వాగు పరివాహక ప్రాంత రైతు సోదరులు హాజరయ్యి అయ్యావారిపల్లి గ్రామ రైతులకు అండగా నిలబడలని వారు ఈ సందర్భంగా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఆకట్టుకున్న ప్రసన్న కూచిపూడి నృత్య ప్రదర్శన..!

### ప్రశంసించిన తెలంగాణ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



వాయిస్ టుడే న్యూస్, ఫిబ్రవరి 20 మేడిపల్లి : ఫీర్జాదిగూడ కార్పోరేషన్ భగత్ సింగ్ నగర్ కు చెందిన ఎం ప్రసన్న కూచిపూడి నృత్యాంశాలతో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. కెజివిబి పాఠశాలలో మంగళవారం సాంస్కృతిక ప్రదర్శలు నిర్వహించారు. కళాకారిణి ప్రసన్న చేసిన నృత్యం సందర్శకులను అలరించాయి. ఈ ప్రదర్శనకు వుఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చిన్నారిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గోన్నారు.

# మోదీని మూడోసారి ప్రధానిగా చేద్దాం...

### విజయ సంకల్ప యాత్ర ప్రారంభించిన కేంద్ర మంత్రులు పరుషోత్తమ్ రూపాల, కిషన్ రెడ్డి



మక్తల్ ఫిబ్రవరి 20 వాయిస్ టుడే ప్రతినిధి: ప్రపంచ దేశాల్లోనే భారత దేశాన్ని ముందంజలో తీసుకెళ్తున్న నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా చేద్దామని కేంద్ర మత్స్య శాఖ మంత్రి పరుషోత్తమ్ రూపాల, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. విజయ సంకల్ప యాత్ర ను క్రిష్ణ మండల కేంద్రము నుంచి ప్రారంభించారు. అనంతరం మఖ్తల్ పట్టణంలో జరిగిన కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశంలో జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, ఎయిర్ పోర్ట్ లు నూతనంగా నిర్మాణం అయ్యాయని అన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఉపాధి హామీ పథకం కింద నిధులను ప్రధాని మోదీ మంజూరు చేస్తున్నారని తెలిపారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ను తీర్చిదిద్దారని అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని, జార?ండ్ లో ఓ ఎంపీ ఇంట్లో 400 కోట్ల నగదు బయటపడిందని, లెక్కించడానికి కౌంటింగ్ మెషీన్లు సైతం సరిపోలేదని అన్నారు. నరేంద్ర మోదీ కృషితోనే అయోధ్యలో బలరాముని ప్రాణ ప్రతిష్ట జరిగిందని, ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు హర్షించాయని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని, ఇప్పటికే మూడో సారీ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గుర్తు కమలం గుర్తుకు ఓటేసి, బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి, నరేంద్ర మోదీని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి, మాజీ మంత్రి డీకే అరుణ, రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్, జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు బి.కొండయ్య, జలంధర్ రెడ్డి, బండారు శృతి, భాస్కర్ , కర్ని స్వామి, మఖ్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ పావని మల్లికార్జున్, మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు కౌన్సిలర్ లు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణ ముందస్తు చర్యలు చేపట్టాలి

### జెడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్



చిగురుమామిడి ఫిబ్రవరి 20 (వాయిస్ టుడే): రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాస మధుసూదన్ ను స్థానిక జడ్పీటిసి సభ్యులు గీకురు రవీందర్ కోరారు. తాగునీటి సమస్య నివారణ చర్యల నిమిత్తం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు జడ్పీటిసి సభ్యులు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ తో సమావేశమై నీటి సమస్యపై చర్చించారు. మండల ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ త్రాగునీటి సమస్యలు రావద్దని, ఆయా గ్రామాల్లో ముందస్తుగానే సమస్యలను గుర్తించాలన్నారు. మిషన్ భగీరథ, గ్రామీణ నీటి పారుదల శాఖా అధికారులు నీటి సరఫరా, పైప్ లైన్లు నిర్వహణలో శ్రద్ధ వహించాలన్నారు. సర్పంచుల పదవీ కాలం పూర్తయి, ప్రత్యేక అధికారుల నియామకం తర్వాత మండల సమావేశం నిర్వహించలేదని, తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు, అధికారులు హరితహారంలో నాటిన మొక్కలను ఎండిపోకుండా కాపాడాలన్నారు. నిధుల విషయములో ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, గ్రామ పంచాయితీ నిధులతో పాటు మంత్రి గారు ప్రత్యేక నిధులు కేటాయిస్తారని హామీ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో జడ్పీటిసి సభ్యులతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ కుమార్ కాంగ్రెస్ నాయకులు గునుకుల రాజేశ్వర్ రెడ్డి, చెల్పూరి విష్ణుమాచారి, సుపరిండెంట్ ఖాజా మొయినుద్దీన్ పాల్గొన్నారు.




## భువనగిరి నియోజావర్గానికి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

### - భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

### భువనగిరిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– భువనగిరి నియోజావర్గానికి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆయన ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంలేదని విమర్శించారు. నియోజకవర్గంలో ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండేలా క్యాంప్ కార్యాలయం ఉంటుందన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో క్యాంప్ కార్యాలయంలో సిబ్బంది ఉంటారని నేను కూడా వారం లో రెండు రోజుల పాటు ప్రజలకు అందుబాటులో క్యాంప్ కార్యాలయంలో ఉంటాని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, కౌన్సిలర్లు ప్రమోద్ కుమార్, నరసింహ, శ్రీ వాణి, నాయకులు తంగళ్ళపల్లి రవికుమార్, రాజేష్ పాల్గొన్నారు.

# 140 కోట్ల భారత ప్రజల నినాదమే..భారత ప్రధానిగా నరేంద్ర మోడీకి మరోసారి అవకాశం





### గోవా సీఎం డా. ప్రమోద్ సావంత్

### భువనగిరి ఖిల్లా సాక్షిగా తెలంగాణ కోసం కోట్లాడినం:– ఈటెల రాజేందర్

### ఘనంగా బిజెపి విజయసంకల్ప యాత్ర ప్రారంభం

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– భారత ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ మరోసారి ప్రధాని కావాలని దేశ ప్రజలందరూ సంకల్పిస్తున్నారని గోవా సీఎం డా. ప్రమోద్ సావంత్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం జరిగిన బిజెపి విజయసంకల్పయాత్ర ప్రారంభ సభలో ఆయన హాజరై మాట్లాడారు. 140 కోట్ల భారత ప్రజల ముద్దుబిడ్డ మోదీ మరోసారి ప్రధాని కావాలని ఈసారి యువత, మహిళలు అంతా మోడీకే ఓటు వేయాలని నిచ్చయించుకున్నారని చెప్పారు. తెలంగాణలో 10 సీట్లు గెలవడం ఖాయమన్నారు. అయోధ్య రామమందరం తిరిగి నిర్మించి 500 ఏళ్ల క్రితం కూలిన భారతజాతి విశ్వాసాన్ని నిలబెట్టారు కాబట్టే దేశప్రజలందరూ జై శ్రీరాం, జై మోదీ అంటున్నారన్నారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ భువనగిరి ఖిల్లా సాక్షిగా తెలంగాణ కోసం కోట్లాడి సాదించుకున్నామన్నారు. ఈ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ కి ఓట్లు వేస్తే వృధా అన్నారు. దేశమంతా భిన్న సంస్కృతులు, భిన్న ప్రజలు ఉన్నా అందరూ మా మోదీ అని గర్వంగా చెప్పుకుంటున్నారని చెప్పారు. మోదీ వచ్చాక ప్రపంచంలో ఎక్కడ ఉన్నా నేను భారతీయుని అంటే గౌరవం పెరిగిందని గొప్పగా చెప్పుకుంటున్నారని,అబ్దుల్ కలాం రాష్ట్రపతి హెూదాలో అమెరికా పోతే బూట్లు విప్పి చెక్ చేసి అవమానించారని కానీ ఇప్పుడు అమెరికా ప్రెసిడెంట్ భుజంమీద చేయివేసి మాట్లాడే సత్తా మన మోడీ సంపాదించుకున్నారన్నారు.

పదవివచ్చాక గతం మర్చిపోతారు కాని చాయ్ అమ్ముకున్న స్థాయి నుండి వచ్చాను అని గర్వంగా చెప్పుకొనే బిడ్డ మోదీ అన్నారు. కష్టాలు తెలిసిన బిడ్డ కాబట్టే 12 కోట్ల టాయిలెట్ నిర్మించి ఆడబిడ్డల ఆత్మగౌరవం కాపాడిన బిడ్డ మోదీ అన్నారు.కరోనా వస్తే మోదీ కన్నీళ్లు పెట్టలేదు ధైర్యం ఇచ్చి కాపాడి ప్రపంచానికి వాక్సిన్ అందించారని చెప్పారు.మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ 5 వ ఆర్థిక శక్తిగా ఎదిగి మూడవ స్థానం తీసుకురావాలి అనేది మోదీ సంకల్పమన్నారు.మన ఎలక్ట్రానిక్ వస్తువులు మనదేశంలోనే ఉత్పత్తి చేసుకునే స్థాయికి ఎదిగినం. ఇప్పుడు అంతా మేడ్ ఇన్ ఇండియా అయిందన్నారు. కుటుంబాన్ని ముందు పెట్టడం వల్లనే జాతిపిత అవుదామనుకున్న కేసీఆర్ 10 ఏళ్లకే ఖతం అయ్యిందన్నారు.నాకు కుటుంబం లేదు 140 కోట్ల మంది నా కుటుంబం అని చెప్పుకునే వ్యక్తి నరేంద్ర మోదీ ఈశఖం మోదీ శఖం అన్నారు. బీజేపీ వస్తే కమ్యూనల్ దేశం అవుతుంది అన్నారు. కాలేదు సరికదా.. ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న వ్యక్తి అన్నారు. కాంగ్రెస్ హామీలపై ఇప్పుడే విమర్శించను.. కానీ మీ హామీలు అమలు చేయకపోతే వదిలిపెట్టేది లేదన్నారు. సురక్షితంగా.. సుభిక్షంగా. ఆత్మగౌరవంతో గల్లా ఎగురవేసుకొని బ్రతకాలి అంటే నరేంద్ర మోదీకి ఓటు వేసి గెలిపించాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, ప్రకాశ్ రెడ్డి, వర్షిత్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, నాయకులు పడమటి జగన్మోహన్ రెడ్డి, చందా మహేందర్ గుప్తా,పడాల శ్రీనివాస్, ఉమా శంకర్, రత్నపురం బలరాం, రత్నపురం శ్రీశైలం, ఉడుత భాస్కర్, జనగాం నరసింహా చారి పాల్గొన్నారు.